# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-05-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని కోరుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **కర్నూలును స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.**

3. **మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈగల్ ఐజీ ఏకే రవి కృష్ణ కోరారు.**

4. **రాష్ట్రవ్యాప్తంగా బక్రీద్ పర్వదిన వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.**

==========================

ఎన్టీఆర్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం భారత రత్న ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని కోరుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న మహానాడులో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. భారత రాజకీయ చరిత్రలో ఆయన సేవలు అపూర్వమని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 31 సెకన్లు

--------------------------

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 10వ ముఖ్యమంత్రి, ప్రముఖ తెలుగు చలనచిత్ర నటులు నందమూరి తారక రామారావు జయంతి ఈ రోజు. తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు అయిన నందమూరి తారక రామారావు 1923, మే 28వ తేది న కృష్ణా జిల్లా నిమ్మకూరు గ్రామంలో జన్మించారు. జానపదం, సాంఘికం, పౌరాణికం వంటి చిత్రాల్లో అనేక పాత్రల్లో నటించి మెప్పించారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో కలిపి దాదాపు 400 చిత్రాలలో ఆయన నటించారు. ముఖ్యమంత్రిగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారు.

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నివాళులు అర్పించారు. తెలుగు

చలనచిత్ర రంగానికి ఆయన అందించిన సేవలు తరతరాలను అలరిస్తూనే ఉన్నాయని కొనియాడారు. సమాజ సేవ, పేదలు, అణగారిన వర్గాల సాధికారతకు కృషి చేశారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి స్ఫూర్తిగా ఎన్టీఆర్ నిలిచారని తెలిపారు.

-----------------------------

కర్నూలును అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూలు నగరంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కర్నూలును 'స్మార్ట్ సిటీ' జాబితాలో చేర్చేందుకు వివిధ కాలనీలలో కచ్చా రహదారులు, మురుగునీటి వ్యవస్థ ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ పనులన్నీ రెండు వారాల్లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలుపుతూ,

వాయిస్ 21 సెకన్లు

-----------------------------

మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మాదకద్రవ్యాల నిరోధక విభాగం – ఈగల్ ఐజీ ఏకే రవి కృష్ణ కోరారు. ఈగల్ ఆధ్వర్యంలో పార్వతీపురంలోని ఒక వస్త్ర దుకాణంలో "సబ్‌స్క్రైబ్ ఈగల్ సోషల్ మీడియా అండ్ అవేర్నెస్" కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. ఇందులో భాగంగా మత్తుపదార్థాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, చట్టపరమైన పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవి కృష్ణ మాట్లాడుతూ, యువత భవిష్యత్తును ప్రభావితం చేస్తున్న మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వినియోగంపై సమాచారం ఉంటే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని సూచించారు.

-----------------------------

ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి విమానాశ్రయాల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తోంది. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో సింగపూర్ నుంచి వచ్చే ప్రయాణికులకు ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్షలు చేపడుతున్నారు. ఈరోజు సింగపూర్ నుంచి వచ్చిన 183 మంది ప్రయాణికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జితేంద్ర కుమార్ మాట్లాడుతూ, ప్రయాణికుల్లో ఎవరికీ ఎబోలా లక్షణాలు కనిపించలేదన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలుపుతూ,

వాయిస్ 17 సెకన్లు

-----------------------------

రాష్ట్రవ్యాప్తంగా బక్రీద్ పర్వదిన వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ముస్లింలు మసీదులు, దర్గాలకు చేరుకుని ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. ఇందులో భాగంగా నంద్యాలలోని భీమవరం రోడ్డులో ఉన్న ఆల్వార్ ఖాన్ దర్గాలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... బక్రీద్ పర్వదినం త్యాగానికి, ప్రేమకు ప్రతీక అని అన్నారు. దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ప్రార్థించానని తెలిపారు.

-----------------------------

ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ గత 12 సంవత్సరాల్లో ప్రజాహిత పరిపాలన అందిస్తూ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకున్నామని పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన లబ్ధిదారులు తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా త్రాగునీటి అవసరాలు తీర్చుకుంటున్నామని తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన చింతా సుబ్బారావు తెలిపారు.

వాయిస్ 14 సెకన్లు

అలాగే కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా అందించే నగదు సాగు సమయంలో విత్తనాలు, ఎరువులుకు ఉపయోగపడుతుందని లబ్ధిపొందిన రైతు కె.శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 కార్యక్రమాల్లో భాగంగా విశాఖపట్నం తపాలా డివిజన్ కార్యాలయంలో యోగాభ్యాసాలను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో తపాలా శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత మెరుగుపడుతాయని నిపుణులు వివరించారు. ఉద్యోగుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని విశాఖపట్నం తపాలా డివిజన్ వెల్లడించింది.

---------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో చేపట్టిన జనగణన కార్యక్రమాన్ని ఖచ్చితత్వంతో, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఆమంచర్ల, పొదలకూరు, విజ్ఞేశ్వరపురం తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఈ రోజు ఆయన పర్యటించి జనగణన, ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జనగణన ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అదే విధంగా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని కూడా ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

పార్వతీపురం మన్యం జిల్లాలో 2029 నాటికి 100 శాతం వయోజన అక్షరాస్యత సాధించడమే "అక్షర ఆంధ్ర – ఉల్లాస్" కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి తెలిపారు. "అక్షర ఆంధ్ర – ఉల్లాస్" అక్షరాస్యత కార్యక్రమాన్ని పార్వతీపురంలో జిల్లా కలెక్టర్ ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 70 వేల మందికి పైగా వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ముఖ్యంగా 15 నుండి 59 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలు, కార్మికులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

====================